# ముత్తాయి కూతురు

శ్రీ మా. గోఖలే

ఆ గుంటుపల్లి పల్లెటూరుకు కొంచెం పెడగావున్న మాలపల్లిలో ఓ మూలగుడిసెలోంచి తెల్లవారి చద్దిబువ్వతిని, పైపంచతో మూతితుడుసుకుంటూ బయిటికి వొచ్చాడు మాదిగ ముత్తాయ్.

గుడిసె పక్కన సాయిమేకుకు కట్టివున్న బఱ్ఱె పడ్డకు నాలుగు గడ్డిపరకలు వేసి మునుసుబు కచేరి నౌకరుపనికి పోదామనుకుంటున్న ముత్తాయికి మట్టి గాబు దగ్గిర రొచ్చులో దిగి, ముంతతో గాబులో నీళ్లు తాగుతున్న తన నాలుగేళ్ళ కూతురు లచ్చి కనుపించింది.

"అప్పుడే తెల్లారిందంటే నీకు గాబుకాడికి చేర్దానికీ ? మీ అమ్మ సూసిందంటే చంపుద్ది రా ఇటు" అన్నాడు ముత్తాయ్ బఱ్ఱెపడ్డకు గడ్డిపరకలు వేస్తూ.

"ఈ లచ్చిముండ అప్పుడే గాబుకాడికి చేరిందీ? ఒస్తున్నా, ఇయాల దీనికి మూడిందే" అంటూ గుడిసెలోంచి, ముత్తాయ్ పెళ్ళాం మాణిక్యం కేకేసింది.

ముంత గాబులో దభీమని పారేసి బురదకొట్టుకొంటూ గబగబ ముత్తాయ్‌దగ్గిరకు పరుగెత్తుకొచ్చింది లచ్చి.

"ఛీ, నీ బురద సేతుల్తో నన్ను ముట్టుకోమాక" అంటూ కూతురుకు దొరక్కుండా పక్కకు తప్పుకుంటున్నాడు ముత్తాయ్ నవ్వులాటగా.

"మరి నాకు సెనగపప్పు తెచ్చిపెత్తానంతే"... అంటూ బురద చేతుల్తో ముత్తాయ్ వెంటపడింది లచ్చి పెద్దపెట్టున కేరింతలు కొడ్తూ.

"ఆసి సచ్చిందానా, ఇంకా తెల్లగా తెల్లార్నన్నా లేదు అప్పుడే ఒల్లంతా బురదపూసుకుండా? ఇయ్యాల నీ ఈపు పగిలిందే—ఒత్తున్నా వుండు" అంది గుమ్మంలో కొచ్చిన మాణిక్యం, సూర్లోంచి ప్రి టిముట్టు తీసుకుని లచ్చి దగ్గిరకొస్తూ.

"అయ్యా, అయ్యా" అనరుస్తూ మాణిక్యానికి దొరక్కుండా తప్పించుకుని ముత్తాయిని గభాల్న వాటేసుకుంది లచ్చి.

"అయ్యో, సచ్చిందానా, అయ్యపంచకు బురద పుయనే పూశావుగంటే! ఉండు నీకు రాసింది"... అంది మాణిక్యం లచ్చిమీదికొస్తూ.

"ఏహె ఉండు ఏంది నీ రగడా"...అంటూ లచ్చి ఒళ్లు తడివి"..."పిల్లఒళ్లు ఎచ్చగా ఉందేమే ?" అన్నాడు ముత్తాయ్.

ఆ? ఎచ్చగా ఉందా? అయ్యో నాతల్లీ" అంటూ ఎన్నకరిగినట్టు కరిగిపోతూ లచ్చిపొట్టపట్టుకు సూసింది మాణిక్యం.

"పిల్లదానికి కాకతగిలిందిలేయే," అన్నాడు ముత్తాయ్ లచ్చి మెడకింద సెయిపెట్టి చూస్తూ.

"ఎచ్చగా పొట్టావజానుంటే కాకతగిలిందని ఇంకా మెల్లిగా అంటావేం? తెల్లారి ముక్క కార్తుంటే అప్పుడే అనుకుండా ఇయ్యాలేందో ఉండదని" అంది, మాణిక్యం లచ్చి సేతులూ, ఒంటిమీద బురద కడుగుతూ.

"ఏందే తెల్లారే పోట్టుకుందీ? కాత్తె కసాయం కాసిపోత్తావంటే?" అన్నాడు ముత్తాయ్, అడీష లచ్చిసేసిన బురద తుడుసుకుంటూ.

"నుప్పసేశాగా. ఇప్పుడే కాసిపోత్తా" అంది మాణిక్యం, లోపల్నుంచి ఇంత ఉప్పుగల్లు తెచ్చి లచ్చికి దిష్టితీస్తూ.

"నిన్న రేత్తే మునుసుబుగారు ఊర్నుంచి ఒచ్చారంట. నేను కచేరిసావిడికి ఎల్తుండాగానీ పిల్లదాన్ని బయిటికెక్కడికీ కదల్నీమాకేవ్" అన్నాడు ముత్తాయ్ సుట్టముట్టిచ్చుకుని బయల్దేర్తూ.

"కాత్తె పెందలకాడే తిరిగిరాయ్యా," అంది మాణిక్యం లచ్చిని చంకకెత్తుకుంటూ.

# ముత్తాయి కూతురు

మాలపల్లినుంచి గుంటుపల్లికి ఎంతలేదన్నా అరమైలు పైసిలుకుంటుంది. గుంటుపల్లి మునసుబు కచేరీలో ముత్తాయికి వెట్టిపని. ఈ నౌకరీ ముత్తాయికి ముత్తాతలనాటినుంచీ దొర్లుతూ ఒచ్చిందే. మోతాదు బడే సాయిబు కచ్చేరీలో వేలిముద్రలేయించడం, లెక్కల పుస్తకాలు, సిరాబుడ్లు సరిమాడ్డం, సిస్తు వసూళ్లకు వారికీ వీరికి ఎచ్చరికలు సెయటం మొదలైనవి సూసుకుంటుంటే ముత్తాయి పొలాల కొలతలకూ, టంకు వేసేందుకూ, ఇంకా సిల్లరమల్లరపన్లు సేసేందుకూ ఏర్పాటైనాడు. ఇదిగాక దేవుడిగుడి తిరణాలకు డప్పుకొట్టే, కాష్టాలకు కట్టెలు మోసీ, పసువులు చస్తే తెమ్ముకుని, ఆటితోళ్లతో సెప్పులు, ఎద్దుమెళ్లో పట్టెళ్లు, సికమార్లు, సెర్నాకోలలు సేసి కుటుంబం గడుపుకుంటున్నాడు ముత్తాయ్.

మాలపల్లి జనం కూలిజనం గనుక పెందరాళే లేస్తారు. వీలుంటే పెళ్లాలకు సాయంగా ఊరిబయట కుంటలో నీళ్లు తెచ్చి బానలు, బుంగలు నింపి కూడు తిని కూలిపనికి పోయ్యేవారుపోతే, సీకట్లో లెగసే లెగవంగానే సెత్తిన పైపంచేసుకుని ఎల్తుర్లో పెళ్లాం, పిల్లజల్లను సూసుకోనన్నా సూసుకోకుండా పనికెల్లిపోతారు కొందరు మాలపల్లి జనం.

"ఓరి ముత్తాయోవ్? ఇయాలేం కచేరీకి వా ఉసిమీ నెల్తుండావు. మునసుబుగా రొచ్చారా?" అని వీపుమీద కావిడిబరువుకు నిగడదన్నుకుని కుంటనుంచి బరబరా ఒస్తున్న లచ్చాయ్ కేకేశాడు ముత్తాయిని.

"నిన్న రేత్తిరే ఒచ్చారు మునసుబుగారు. సిస్తు బకాయిలు ఇంకా మిగిలుండయిగా, ఇయాల సానా మటుకు వసూలుగావాలి మరి. ఇంకా నువు కూలిపనికి పోకుండా ఈడే కూకుండావేరా ? ఇయాల మా మరదలుపిల్ల నీలుపోసి గాని పోనీనని నిలేసిందా ఏరా ?" అన్నాడు ముత్తాయ్ కావిడిబద్ద ఊపుకుంటూ దగ్గర కొచ్చిన లచ్చాయితో.

"అదిగంతేలే. పోనీగందా అని ఏనాడన్నా కుంటనుంచి నాలుగు బుంగలనీలు తెచ్చిపోత్తానా? ఇదిగో ఈ వజానంటూరు. అందుట్లో నీకు సందు దొరుకుతేసాలు మరదల్ని ఎనకేసుకొత్తావు. నోట్లోకి కాత్తె పుగాకుముక్కుంటే పెడ్తావంట్రా ముత్తాయ్ ?" అన్నాడు లచ్చాయ్, కావడిబరువుతో కాసేపు ఆగుతూ.

"ఎబ్బె నీతోడు, ఏలడంటే ఏలెడుంటే ఇంతకు ముంగలే సుట్టసుట్టు కుండా. ఉంటే రేప్పెడ్తాలే. పిల్లదానికి కాత్తె కాకతగిల్నట్టుందిరా లచ్చాయ్" అన్నాడు ముత్తాయ్.

"చా, ఇంతకుముంగలే మీ గాబుకాడ నీలు పారబోత్తుంటే సూశాను గదంట్రా ముత్తాయ్? పిల్ల బాగనే ఉండదే? ఇంతలోనే కాకట్టతగిలిందిరా ?" అన్నాడు లచ్చాయ్ నమ్మనట్టు.

"ఆళ్లమ్మ కేకలేత్తుంటే ఒచ్చి నా కాళ్లు వాచేసుకుంటే ఇట్టసూద్దును గందా, ఒళ్లు ఎచ్చగా ఉంది" అన్నాడు ముత్తాయ్, లచ్చి ఒంటివేడి తనసేతులకు ఇంకా తగుల్తున్నట్టుగా.

"ఓసి, మద్దాన్నానికి అదే జారిపోద్దిలే. మరి పిల్లదానికి నోట్లో కాత్తేమన్నా పోశావా?" అన్నాడు లచ్చాయ్.

"మీ ఒదినె కసాయం కాసిపోత్తానందిలే" అన్నాడు ముత్తాయ్.

"ఇగనేం, మా మాణిక్కెం ఒదినెకు ఇసువంటి వైద్దికాలు సానా తెలుసు. ఇహ దానంతటదే పోద్దిలే. అదిగో నీమరదలు దడికాణ్ణుంచి అప్పుడే నిక్కి నిక్కి సూస్తుండది - ఎల్తుండారోయ్ ముత్తాయ్" అంటూ కావడిబద్దతో కిర్ కిర్ ఊక్కుంటూ ఎల్లిపొయ్యాడు లచ్చాయ్.

లచ్చాయ్ గుడిసెదడిదగ్గిర నిజంగానే నిలబడి సూస్తున్న సుబ్బాం వేపు సెయి ఊపుతూ గుంటుపల్లి వేపుకు సాగాడు ముత్తాయ్.

— సుబ్బాముంటే తనకెంతో గురో మగ్గ మగ్గ అనుకుంటుంటాడు ముత్తాయ్. తనకు మాణిక్యంమీద మనసుమళ్లి సెడ్డ తపనబడ్తున్నరోజుల్లో సుబ్బాం అతీతెలివిగా యవారం పెళ్లి ఏర్పాటుదాకా నడిపి తనకూ మాణిక్కానికి జోడుకలిపింది. ఇందుకు తనూ, మాణిక్యం నాగారుబొమ్మకు ఓ ఏటపోతును బలిచ్చుకున్నారు గూడా. తన పెళ్లయి మాణిక్యంతో సుకంగా గడిసిపోతుంటే కొన్నాళ్లకు సల్లగా నస సాగించింది మాణిక్యం. తనకు పిల్లలు పుట్టకపోటం వల్ల తనను గొడ్డుమోతని ఒకరిద్దరనుకోటం ఇన్నానని మొదులపెట్టింది మాణిక్యం. కరువులో అదికమాసం అన్నట్టు పిల్లలకోసం ఇప్పట్నుంచీ ఎగబడ్డన్నాడు తను మాణిక్యంతో. ఇప్పటికిప్పుడు పిల్లలు

పుట్టకపోతేమటుకు ముందుకు పుట్టరనే ఖరానా ఏమిటని కూడా తను మాణిక్యంతో సానాసార్లు సెప్పి సూశాడు. అయినా మాణిక్యం నస ఆపకపోంగా కనపడ్డ సెట్టుకు పుట్టకు దీపాలెలిగించీ, పాలుపోంగించీ పప్పుబెల్లాలు పెట్టీ, తడిగుడ్డల్తో పెదచ్చినాలు సేసీ సెడ్డ గందరగోళం సేసింది లచ్చిపుట్టేదాకా. లచ్చి పుట్టె మాణిక్యం మళ్లీ మామూలుదారినపట్టం తన బరువంతా తీసేసినట్టయింది ముత్తాయికి. ఏమయినా తన పెళ్ళాంకంటే తనకే లచ్చింటే ఎక్కువ ముద్దని మాణిక్యం లచ్చిమీద కేకలేస్తున్నప్పుడల్లా అనుకుంటాడు ముత్తాయ్. అందుకే లచ్చికి ఏ ఇంత ఎచ్చు తగ్గు లొచ్చినా కొత్తె కంగారుపట్టం ముత్తాయికి వాల్తి. అయితే ఏ లచ్చాయిలాంటె మనసుకలిసిన మనిషోగనక ఈపుత్తడ్తే దైర్నంగా నిలబడిపోయే మనిషే ముత్తాయ్‌గూడా.

మునుసుబుగారింటె కెల్లి డణ్ణాలు పెట్టుకుని, మునుసుబుగారి గొడ్లసావిట్లో గొడ్లకు మేత ఉందో లేదో సూసి, జీతగాడు సావిడంతా బాగుసేసిపోయినా మళ్లీ ఒకటి రెండు పేడకళ్లు తీసేసి, మునుసుబుగారి పెళ్లాం సెంద్రమ్మగార్ని పనేమన్నా ఉండదా అని అడిగి, లేదనిపించుకుని, మునుసుబుగారు నిద్దలేసుకుని కచీరుసావిడికి బయలుదేర్తే ఎనికీ డ్డేవస్తూ, కచీరుసావిడి గుమ్మందగ్గిరకు సేరి సేతులుకట్టుకుని నుంచున్నాడు ముత్తాయ్.

పెదకరణం, సినకరణం అప్పటికేవచ్చి లెక్కలు రాసుకోటం ఓరకన్నుతో సూశాడు ముత్తాయ్.

“ఇవాళ సిస్తులు కట్టాలని మొన్న టంకు వేశావ్రా ముత్తాయ్?” అని కేకేశాడు కచేరిలోంచి మునుసుబుగారు.

“సిత్తం దొరా. తమరు సెప్పినట్టే ఓ పూట పూటంతా టంకేశానండి” అన్నాడు ముత్తాయ్, మునుసుబుగారి కంటికి కొంచెం ఓరగా కనుపిస్తూ.

“మరి ఏరీ ఇంతవరకు ఎవరూ రాలేదేం?” అన్నాడు మునుసుబుగారు విసుగ్గా.

“బడేసాయిబు కేకేసుకురాటానికి ఎల్లాడండి. అదిగో రామయ్యగోరు ఒత్తున్నాడు దొరా” అన్నాడు ముత్తాయ్ రామయ్యకు దారి ఒదుల్తూ.

“ఇవాళే సిస్తుకట్టాలని గాపకమే లేదండి మునసబుగారూ” అంటూన్నాడు కచేరిసావిట్లోకి పోయిన రామయ్య.

“ఇదేం మర్యాద రామయ్యా? ఇప్పటికి రెండు వాయిదాలు దాటిపోయినై. ఇంకెన్నిసార్లు టంకు వేయించమంటావో నువ్వే చెప్పు” అని నెమ్మదిగానే అడుగుతున్నాడు మునుసుబుగారు.

“మళ్ళీ టంకు దేనికి? రెండుమూడురోజుల్లో పిలవకపోయినావచ్చి కట్టిపోతే సరిగా” అంటున్నాడు రామయ్య.

“ఒరేయ్ ముత్తాయ్? ఆ రత్తయ్యను వెళ్ళి పిల్చుకురారా—ఊరంతకీ తెలిసినా ఆయనకుమటుకు తెలియలేదంటాడూ?” అని కేకేశాడు మునుసుబుగారు.

“రత్తయ్య బర్రెగొడ్డు ఇంతకుముంగలే చచ్చిపోయిందంట, మరి ఏం వస్తాడో...” అన్నాడు రామయ్య.

“సరే, చచ్చిన గొడ్డును బతికించటం ఎవరివల్లవుతుంది. రామయ్యా, సర్కారుసొమ్ము కట్టకపోతే వేచీ వస్తుందిగానీ? వెళ్లి కేకేసిరారా ముత్తాయ్?” అన్నాడు మళ్లీ మునుసుబుగారు.

చచ్చిన బర్రెగొడ్డుముట్టూతా తిరుగుతున్న రత్తయ్య కెదూరుగా వెళ్ళి నిలబడ్డాడు ముత్తాయ్.

“వెయ్యేళ్లు బతకరా ముత్తాయ్, అనుకుంటుండగానే ఒచ్చావు. ఎటువంటి బర్రెగొడ్డు చచ్చిందో చూశావా?” అన్నాడు రత్తయ్య విచారంగా.

“తమరి బర్రెగొడ్డు నాకు తెలవకుంటుండీ దొరా? మాలావుపుటగ్గలది!” అన్నాడు ముత్తాయ్.

“సరే, బతకనిబిడ్డ బారెడు. మరి దీని సంగతేమంటా? బయటకి చేరేస్తావా” అన్నాడు రత్తయ్య.

“అదేంటి దొరా కొత్తగా మాట్లాడ్తుండారూ? సచ్చినగొడ్డును మేం గాకపోతే ఇంకెవరు తీసికెల్తారూ”? అన్నాడు ముత్తాయి.

“అదిసరేలేవోయ్. కాదని ఎవరన్నారూ? ఇదిగో ముత్తాయ్? ఎందుకంటున్నానో అనుకోవద్దుగానీ—బర్రె ఖరీదు నాలుగు రూపాయలవుతుంది. తరవాత నీ ఇష్టం” అన్నాడు రత్తయ్య.

“సచ్చినబర్రె నాలుగు రూపాయిలా? ఎప్పుడూ ఇన్లేదండి దొరా” అన్నాడు ముత్తాయ్, అట్టాగే నోరు తెరుస్తూ.

"ఇప్పుడు వింటున్నావుగా, చచ్చినబక్రెయినా నాలుగు డబ్బులు గిట్టుబాటు చేస్తుంటే నాలుగో మూడున్నరో ఇచ్చుకుంటే దండగ కాదుగా?" అన్నాడు రత్తయ్య.

"తమ రట్టంటే మా బీవోళ్లంగాకాలి దొరా. మునుసుబుగోరు తమర్ని కేకేయమంటే ఒచ్చానండి రత్తయ్యగోరూ" అన్నాడు ముత్తాయ్.

"విన్నాం లేవోయ్ ఇంతకుముందరే మీ బడే సాయిబును తోలరుగా, మళ్లీ నువుకూడానా? దాంధుంపదెగిరి మరీ ఒకటే ఊదరైతే ఎట్లా? ఇదిగో నాచేత నాలుగుసార్లు ఎందుకనిపిస్తావు, దీని విషయ మేమంటావో పైసల్లేసి మధ్యాహ్నం లోపల తేల్చి చెప్పెయ్, మళ్ళీ ఇంకోర్ని మాసుకోవాలి" అనేసి ఇంట్లోకి వెళ్లిపొయ్యాడు రత్తయ్య.

చచ్చినబక్రెగొడ్డు నోసూపు చూసి అలోచిస్తూ రత్తయ్య చుమ్మంది గాడు ముత్తాయ్.

"ఒరే ముత్తాయ్!" అని కేకేశాడు బైస్కిలు బండిమీద ఉసిగా పోతూ బేకునొక్కి ఆగిపోయిన ఆస్పత్రి డాక్టరు.

"దణ్ణాలండి డాటరు దొరా" అన్నాడు ముత్తాయ్.

"ఒరేయ్, ఇంట్లో కట్టెలు లేవల్లే ఉంది; వెళ్లి నేను చెప్పానని చెంచయ్య కొట్లో రెండు సుళ్ల కట్టెలు ఇంట్లో పడేసిపో" అంటూ ముత్తాయ్ సుక్క తిప్పుకునేలోపే డాక్టరు బైస్కిలుమీద మాయమయ్యాడు.

ఇహ తప్పదు తొందరగా చేసేసి పోదామని చెంచయ్య కొట్టువేపుకు ముత్తాయ్ నాలుగడుగులు వేశాడో లేదో-"ఒరేయ్ ముత్తాయ్ ఒక్క క్షణం ఆగరా?"...అని ఆడగూతురు గొంతు వినిపించింది.

"అబ్బే ఏం లేదులే, ఏమిటో డాక్టరుగారు నీతో చెప్పిపోతున్నారూ?" అంది సీతారావుమ్మ. ఎదురింటిచుమ్మంలో నిలబడి డాక్టరు వెళ్లిన దిక్కు నిక్కినిక్కి చూస్తూ.

"ఆఁ ఏం లేదండీ సీతారావుమ్మగోరూ! నాలుగు కట్టెపేళ్ళు ఇంట్లో పడేసి పోమన్నారండి" అన్నాడు ముత్తాయ్ తొందరపడ్తూ.

"అహాఁ అయినా ఆయ నేం చెబితే నాకెందుకులే. ఒక్కసారి ఇటొచ్చిపోరా ముత్తాయ్. కర్మ కాలిపోను. తెల్లవాని లేఖంగానే నాకీ బ్రహ్మత్య చుట్టుకుంది. మా దొడ్లో పిల్లి చచ్చింది. నాయన్నాయన కాస్త దాన్ని అటెటైనా పారేసిపోదూ" అంది సీతారావుమ్మ ఆరాటంగా.

"అబ్బో, పానాపన్లుండాయ్ దొర్సానమ్మగోరూ" అనంటున్నాడు ముత్తాయ్.

వాటికేంలే నీకెప్పుడూ ఉండేవే. నువు ఇప్పుడు కాదన్నావంటే ఇహ బ్రహ్మదేవుడు దిగివచ్చినా ఆ పిల్లిని నాకంటికి కనపడకుండా తప్పించలేడు. నాయనాయన" అంది సీతారావుమ్మ దొడ్లోకి దారితీస్తూ.

సీతారావుమ్మ పిల్లి పనినుంచి బయటపడి, చెంచయ్య కొట్టుకు గబగబ వెళ్తున్న ముత్తాయికి మాలపల్లినుంచి ఒస్తున్న ఆదాయ్ కోడలు వీరమ్మ దార్లో ఎదురయింది.

"ఏం ఈరమ్మా బాగుండావా? యాడకెల్తుండా?" అని పలకరించాడు ముత్తాయ్ వీరమ్మను.

"పిల్ల కాలవగట్టుకెల్తుంటా గానీ మీ లచ్చికి కాక తగిలిందంటగా? పిల్ల బురబుర్లాడ్తా అదేమయిన దగ్గతుండదంటా డాటరుగారికాడ ఏవన్నా మందు తీసుకురామని సెప్పమంది మాణిక్యం" అంది వీరమ్మ

"ఆఁ కాక బాగా ఎక్కువైందా ఈరమ్మా?" అన్నాడు ముత్తాయ్.

"అదేమో మరి, పిల్ల సూడబోతే కాత్తె వలిగినట్టే ఉంది. ఎందుకైనా మంచిది ఆ డాటరుగార్నడిగి మందిప్పిచ్చుకుని దబ్బున ఇంటికెళ్ళరాదూ? నేనెల్తుండా నీ తమ్ముడు నాకోసం ఆ పిల్లకాలవగట్టుమీదే కూకునుంటాడు" అంటూ వెళ్ళిపోయింది. వీరమ్మ.

ఇంకొంచెంసేపటికి కట్టెలు తెచ్చి దొడ్లో ఏసి, సెమట తుడుసుకుంటూ ఆస్పత్రిలో డాక్టరుకు కనుపించేట్టు కాత్తె పెడగా నిలబడ్డాడు ముత్తాయ్.

"తెచ్చి పడేశావా?" అన్నాడు డాక్టరు రోగులకు మందులు రాసిస్తూ.

"పడేశానండి, పిల్లదానికి కాకతగిలింది దొరా" అన్నాడు ముత్తాయ్.

"ఏ పిల్లదానికి?" — అన్నాడు డాక్టరు, తలొంచుకుని రాసుకుంటూ.

"మా పిల్లదానికేనండి"—అన్నాడు ముత్తాయ్.

"కాక తగిలిందా"—అన్నాడు డాక్టరు.

"అవును దొరా" అన్నాడు ముత్తాయ్.

"ఉహు, సరే కాసేపుండు" అన్నాడు డాక్టరు ఓజబ్బుమనిషిని పొట్ట ఒత్తిచూస్తూ.

"బురబుర్లాడ్తా దగ్గుకూడా బాగా ఉందంటండి దొరా" అన్నాడు ముత్తాయ్, కాసేపుసూసి.

"ఎవరికి?"...అన్నాడు డాక్టరు, ముత్తాయి నోసారి మళ్ళీ చూస్తూ.

"నా పిల్లదానికేనండి దగ్గూ జరం బాగా ఒచ్చిందండి"...అన్నాడు ముత్తాయ్ కాత్తె గట్టిగా.

"ఏం తిన్నదేం?" అన్నాడు డాక్టరు.

"పిల్లముండ అదేం తింటదండీ నిన్న ఇంకంటే ఇంత ఉల్లికారం, దొగ్గలాకుపప్పు తిన్నదండి" అన్నాడు ముత్తాయ్.

"ఏదీపిల్ల? ఇటుతీసుకురా?" అన్నాడు డాక్టరు

"పిల్లదాన్ని తీసుకురామంటారండీ?" అన్నాడు ముత్తాయ్ కంగారుపడ్తూ.

"తీసుకురాకపోతే ఎట్లాగయ్యా మందివ్వటం? ఊ వెళ్లి తీసుకురా"

ఆ నడిరేత్రి ఒళ్లు తెలియకుండా నిదరపోతున్న ముత్తాయిని లేపింది మాణిక్యం. గబాల్న చూచి ఒణుకుతున్న మాణిక్యం చెయి పట్టుకున్నాడు ముత్తాయ్.

"పిల్ల-పిలుస్తే పలకటం లేదు"...అందిమాణిక్యం సన్నగా వినపడీ వినపడకుండా.

ముత్తాయ్ మంచమ్మీదకు ఒంగి లచ్చి గుండె మీద సెయి పెట్టాడు. "అకేంటే పిచ్చిముండ పిల్ల సుబ్బరంగా నిదరపోతుంటేనూ?" అన్నాడు ముత్తాయ్. మాణిక్యం కళ్లి అనుమానంగా చూస్తూ.

డొక్క లెగరేసుత్తుండది- మాపిటాల అట్టా లేనేలేదు" అంది మాణిక్యం సన్నగా మూలుగుతూ.

మైకంలో ఉన్న లచ్చి ఊపిరి పీల్చుకుంటానికి తంటాలుపట్టం నిదానంగా సూచిన ముత్తాయ్ మాణిక్యం కళ్ళ బిత్తరసూపులు సూశాడు.

"డాబరివగ్గిర కెళ్దాం — పద —" అంది మాణిక్యం.

"ఇంత నిశిరేత్రప్పుడా? డాటరు పలుకుతాడా?" అన్నాడు ముత్తాయ్.

"కాళ్లు పట్టుకుందాం — బగమంతుడే ఉండాడు —"

దారివెంట కుక్కలరుస్తూ వెంటపడ్తుంటే వినిపించుకోకుండా లచ్చిని బుజానేసుకుని ఒచ్చి డాక్టరు తలుపు గబగబ కొట్టారు ముత్తాయ్, మాణిక్యం.

"ఎవరది?" తలుపు తెరిసి బ్యాట్రీలైటు మీదేసి సూశాడు డాక్టరు.

"ముత్తాయిని దొరా — రచ్చించాలి."

"నీకేమన్నా మతుందా లేదా? గాభరా పెట్టి చంపావే?"

"మీపాదాలు పట్టుకుంటాం దొరా — పిల్లది డొక్క లెగరేత్తుండది."

"ఏక్కినట్టే ఉంది. మేమేం మనుషుల మనుకున్నారా, పిశాచాల మనుకున్నారా? పగలంతా ఏం చేస్తున్నావ్ ఇంత అర్థరాత్రి రాకపోతే?"

"తమరు పిల్లదాన్ని మద్దాన్నం సూసి మందిచ్చారుగందా తగ్గిపోతుందనుకుండాం దొరా. మరింతలో కొంపమీనకొచ్చుద్దని..."

"చాల్లే రండి లోపలికి..."

సగం నిదరమత్తుతో ఒంగి లచ్చిని పరీక్ష చేస్తున్న డాక్టరు ఒక్కసారి నిటారుగా నుంచున్నాడు.

"మీ అలగా జనానికేం తెలియదు" అన్నాడు డాక్టరు పెళ్లున.

"అదేందిదొరా? —" అన్నాడు ముత్తాయ్, మాణిక్యం ఒక్కసారిగా.

"ఇంజెక్షనివ్వాలి, నా దగ్గిర లేదా ఇంజెక్షను. చీటీ రాసిస్తాను పొన్నూరువెళ్లి అర్జెంటుగా తీసుకు రావాలి."

"అబ్బో, అంతదూరమా? ఇంత రేత్రి ఎవరు పలుకుతారు డాటరు బాబూ?"...అన్నాడు ముత్తాయ్ నీలు కారిపోతూ.

"తెల్లవారేదాకా ఉండైనా ఇంజెక్షను తీసుకు రావాలి — అయిదు రూపాయలు తీసుకుపో."

"అయిదు రూపాయిలా?" అన్నాడు ముత్తాయ్.

"సూడు — పిల్లకు ఇంకా మైకం ఒదల్లేదు — అయ్యొయ్యనాలచ్చీ —" అంది మాణిక్యం కోక చెంగు మొహాన కప్పుకుని మూలుగుతూ.

డాక్టరిచ్చిన సీటీ ఒక గుప్పిట్లో పెట్టుకుని, తడుపుకోకుండా రెండో సేయి మాణిక్యం మెళ్లోకి పోనిచ్చి పుస్తెతాడు పటిక్కన తెంచి — ఇంకొక్క క్షణంలో గుంటుపల్లివీధులన్నీ దాటి పెద్దకాలవ గట్టెక్కి పొన్నూరువేపుకు రొప్పుకుంటూ పరుగెత్తాడు ముత్తాయి — సీకట్లో కలిసిపోతూ.